# శ్రీ నాన్నగారి అనుగ్రహ వాక్యములు





గుమ్మలూరు గ్రామ వాస్తవ్యులు

**కీ॥ శే॥ నడింపల్లి కృష్ణమూర్తి రాజు గారి**

సంస్మరణార్థం



అందరి హృదయాలలో ఉన్న పరమాత్ముడిని

చూడు ఆ పరమాత్ముడికి సేవచేసి భగవంతుడు

నీకు ఇచ్చిన జన్మనుధన్యం చేసుకో

## సద్గురు శ్రీ నాన్న గారి అనుగ్రహభాషణలు

1) యజ్ఞం అంటే పని ఎదుటి వారికి చేసినా దృష్టి ఈశ్వరుడి మీద ఉంచి కతృత్వం లేకుండా చేసే పని యజ్ఞంతో సమానం

2) దానం అంటే మనం ఎవరికైన పండు ఇచ్చిన వారు పుచ్చుకుంటారా అని ఆలోచించి వారి ఇంటికి వెళ్ళి ఇవ్వాలి అదియే నిజమైన దానం.

3) మనస్సు-ప్రాణం-వాక్కు మూడు ఒకటి అయి హృదయం వైపు ఎవరికి నడుస్తుందో వారికి అంతర్ముఖం అవుతుంది.

4) నేను-నాది, అహంకారము-మమకారము, కామం-క్రోధం -లోభం-మోహం, మధం-మాత్సర్యం, అసూయ, ఓర్వలేని తనం ఇవన్ని గుణాలకు మూలం దీనికి మనస్సే కారణం

5) గురువు ఆగ్రహం కూడా ప్రేమే. గురువు మీద ప్రేమ, భక్తి ఉండాలి నిజమైన విశ్వాసం కలిగి ఉండాలి.

6) ముద్ద నోటిలో పెట్టుకున్నాక మాట పడిపోతుంది. అలాగే గురువు లోపలికి గుంజుకున్నాక మాట మనస్సు ప్రాణం ఆగుతాయి.

7) మనకి భగవద్గీతే ప్రమాణం. పరమాత్మ గీతలో ఏమని చెప్పాడు అంటే నీకు రూపబుద్దిపోలేదు, నామబుద్ధిపోలేదు కాని అసలు

వస్తువుకి రూపం లేదు, నామం లేదు లోపల సద్వస్తువు నిర్గుణం నిరాకారం నువ్వు అక్కడికి చేరుకోవాలి. ఆ నిర్గుణాన్ని, నిరాకారాన్ని–గోదావరిని మనం ఈదటం లాంటిది. ఈదేవాడు మధ్యలో మునిగిపోవచ్చు. నువ్వు సాధనలో ముందు సాకారాన్నే పట్టుకో సాకారాన్ని పట్టుకుంటే నావ మీద ప్రయాణంలాంటిది నావ మీద కూర్చుంటే నది దాటించేస్తాడు. సగుణం అటువంటిది.

8) మీరు ఏపని చేసినా ఈశ్వరార్పణంగా చెయ్యాలి. ఈశ్వరార్ప ణంగా చేస్తే మనకి ఈశ్వరుని దయ కలుగుతుంది. ఈశ్వరు ని దయ కలిగితే అన్ని మన చేతిలో ఉన్నట్టే, మనం అంతా పొందినట్టే

9) మీకు సహనం లేకపోతే లోతులు పెరగవు–మీ హృదయం యొక్క లోతులు పెరగకపోతే మీకు జ్ఞానం రాదు.

10) మీరు ఇతరులకు ఏదైన సహాయం చేయగలిగితే చెయ్యండి. భగవంతుడు మీకు ఏ గిఫ్ట్ అయితే ఇచ్చాడో అవి మీ తోటివారికి ఉపయోగించండి.

11) ఈ ప్రపంచం అంతా ఈశ్వరుడి స్వరూపమే అని మీకు అనుభవం కనుక వస్తే ఈ ప్రపంచం చేదుగా ఉండదు, పుల్లగా

ఉండదు. చాలా తియ్యగా ఉంటుంది. ఎంత తియ్యగా ఉంటుంది. అంటే మీకు వైకుంఠంలో కూడా ఆ సుఖాన్ని పొందలేరు.

12) మీరు చేసే మంచి కార్యక్రమం వల్ల మీ మనస్సు పెరగకూడదుప మీరు బాగుపడాలి. మనం మాట్లాడేమాట వలన, మనకి అంత:కరణ శుద్ధి రావాలి.

13) మనకి లోపల ఒక ఆలోచన ఉంటుంది, నోటితో వేరొకటి చెబుతాము. ఇలా చేస్తూ ఇతరులను మాయ చేస్తున్నాము అనుకుంటునాము కాని మనల్ని మనం మాయ చేసుకుంటున్నాం.

14) రామకృష్ణుడికి సంకల్పం అంటూ లేదు. వికల్పమంటూలేదు. భగవంతుడు ఇష్టమే ఆయన ఇష్టం. ఆయన సంకల్పమే ఈయన సంకల్పం రామకృష్ణుడిలో నేను అనే తలంపు వెదికినా కనబడదు. ఆయన నిష్కపటి.

15) ధ్యాన నిష్ట, ఆత్మనిష్ట బాగా నిలబడటానికి మనం సత్కర్మ చెయ్యాలి. ఏది ఆశించకూడదు.

16) మనస్సు అనే అహంకారం పోతే లోపల ఉన్నటువంటి జ్ఞానగంగ వెంటనే మన సహస్రారానికి అందుతుంది. అప్పుడు లోపల ఉన్న సుఖం మనకు అందుతుంది.

17) వాసన బలీయంగా ఉన్నప్పుడు దానిని బయటకి గెంటలేము. అనిపిస్తుంది. దేహగతమైన నేనుని బయటకి గెంటికాల్చి బూడిద చేస్తేనే గాని నీకు ఆత్మ జ్ఞానం కలగదు.

18) మనస్సు ఏ కారణం వలన బాహ్యముఖానికి వస్తుందో ఆ కారణాన్ని కత్తిరించుటయే సాధన యొక్క గమ్యం.

19) మీ ప్రారబ్ధాన్ని బట్టి భగవంతుడు మీకు ఏ పని అయితే కేటాయించాడో ఆ పని నువ్వు శ్రద్ధగా భక్తిగా చేయటమే ఆయనకు పెట్టే నిజమైన నమస్కారం.

20) రమణమహర్షి గారు తల్లితో ఏమని చెప్పారు అంటే ఈ శరీరం ఎప్పుడు, ఎక్కడ ఎలా ఉండాలో, ఈ శరీరం ద్వారా ఏ పని జరగాలో అది జరిగిపోతూ ఉంటుంది. అది పూర్తి అయిన తరువాత గాని ఈ జీవుడిని ఈశ్వరుడు తీసుకొనిపోడు.

21) జరుగవలసినది జరిగితీరును, జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా జరగనే జరగదు. ఇది నిశ్చయం.

22) మీ లోపల ఉన్న రహస్యాలు అన్ని భగవంతుడికి తెలుసు. ఎత్తటానికి వీలులేని బరువైన రాళ్ళు ఏవైతే మీ హృదయంలో ఉన్నాయో, ఏ బాధలు మీ హృదయంలో ఉన్నాయో అవి లోకానికి తెలియకపోయినా, మీ లోపల ఉన్న భగవంతుడికి తెలుసు.

23) శరీరాన్ని బట్టే చుట్టాలు మనస్సు బట్టే స్నేహం, విరోధాలు అని శాస్త్రంలో చెప్పాడు. అంత గొడవ ఎందుకు నీ క్షేమం కోరేవాడు ఎక్కడ ఉన్నావాడే నీ చుట్టం, వాడే నీ స్నేహితుడు అని చాణుక్యుడు చెప్పాడు.

24) భగవంతుడు కాలరూపంలో ఉన్నాడు. మనం కాలాన్ని బాగా సద్వినియోగం చేసుకోవాలి. పరమేశ్వరుడు గురించి శ్రవణం చెయ్యాలి. ఆయనను మనం మననం చేసుకోవాలి. భగవంతుడిని తెలుసుకోవాలనే కాంక్ష ఎవరి సమక్షంలో మనకు కలుగుతుందో వారి సమక్షాన్ని కోరుకుంటూ ఉండాలి.

25) ఈ శరీరం ఉండగానే, ఈ శరీరం శవం అవ్వకముందే కోరిక యొక్క వేగం, కోపం యొక్క వేగం, భయం యొక్క వేగం తగ్గించుకో దేనికి భయపడవద్దు అని ఎందుకు చెపుతున్నారు, అంటే భయం నీ సుఖానికి అడ్డు వస్తుంది.

26) మీరు మంచిపనులు చేస్తున్నారు అనుకోండి, ఆ మంచిపనులు చేయటమే మన గమ్యం కాదు మంచి పనులు చేయటం వలన మీకు చిత్తశుద్ధి కలగాలి.

27) యుక్తుడు అంటే నిగ్రహం కలవాడు, సహనం కలవాడు ఏదైనా విషయంలో తాత్కాలికంగా ఓడిపోయినట్టు కనిపించినా, వారే విజయం సాధిస్తారు.

28) నేను అనే తలంపు హృదయంలో నుంచి వస్తుంది. నేను అనే తలంపు ఎక్కడ ఉదయించి వస్తుందో అక్కడ పరమాత్ముడు ఉన్నాడు, అక్కడే ఆనందం ఉంది. అక్కడే శాంతి ఉంది.

29) ఈ నేను అనే తలంపును ప్రశ్నించి, దానిని విచారించి అది ఏ హృదయంలో నుండి అయితే ఉదయించి వస్తుందో అక్కడకు ఉపసంహరించ గలిగితే ఈ నేను అనే తలంపు దాని మూలాన్ని చూసిన వెంటనే అది నశిస్తుంది. అప్పుడు అంతటా ఉన్న నేను నీకు అనుభవంలోనికి వస్తుంది.

30) నీవు అభివృద్ధిలోనికి రాకుండా నీ అనుయాయులు కూడా నీకు అడ్డువస్తున్నారు. అటువంటి వారిని తొలగించుకో వాసనలు కొన్ని వేల జన్మల నుండి అలా వస్తూ ఉంటాయి. వాటిని తొలగించుకోవటానికి తపస్సు అవసరం.

31) వాసన లేనివాడికి తపస్సుతో పనిలేదు. తపస్సు ఫలించాలన్నా, మీ సాధనలు ఫలించాలన్నా ముందు భక్తి ఉండాలి. ఈశ్వరుడి పాదాల పట్ల ప్రేమ ఉండాలి.

32) పిల్లలు నడక నేర్చుకునేటప్పుడు అనేకసార్లు పడిపోతూ ఉంటారు. మరల లేచి నడవడానికి ప్రయత్నం చేస్తూ ఉంటారు. ఈ ఆధ్యాత్మిక సాధన కూడా అంతే మనం ప్రయత్నం చేస్తూ ఉండాలి. ఫెయిల్ అవుతూ ఉంటాము మరల

ప్రయత్నం చెయ్యాలి. ఫెయిల్ అయ్యామని ప్రయత్నం మానకూడదు.

33) బాహ్యపరిస్థితులు అనుకూలంగా ఉంటే మనం సుఖపడతాం అనుకుంటాం కాని బాహ్యపరిస్థితులు అన్ని అనుకూలంగా లేకపోయినా మనోనిగ్రహం కనుక ఉంటే నీవు ఎక్కువ సుఖపడతావు.

34) మీకు ఎవరినైన చూస్తే కోపం వస్తోంది అనుకోండి అక్కడ ద్వేషం ఉంది. ఎవరినైనా చూస్తే మీకు ఇష్టం వస్తుంది. అనుకోండి అక్కడ ఏదో కామం ఉంది. ఇవి రెండు కూడా నిన్ను బంధిస్తాయి. కామక్రోధముల వేగం బలీయంగా ఉంటుంది. ఇవి మీ శాంతిని పోగొడతాయి.

35) మనస్సు ఎప్పుడైతే అణిగిపోయిందో, భగవంతుడిని విడిచిపెట్టి ఏదైతే నేను, నేను అని విజృంభించి వస్తుందో అది అణిగినప్పుడు మహామౌనం వస్తుంది. ఆ మహామౌనం మీకు ఉన్న సంశయాలను ఛేధించి పాడేస్తుంది. ఆ మౌనం మీకు కుదిరితే చాలు.

36) నిజమైన భక్తులు నిర్మలంగా ఉంటారు. కూల్‌గా ఉంటారు. వారు పని చేస్తూ ఉంటారు. కాని పని చేస్తున్న జాడ కనబడదు. ఈ పని నా వల్ల అయ్యింది అని చెప్పేవాడు భక్తుడు కాదు.

37) నాది జీవుడి వేషం నీది దేవుడి వేషం ఈ వేషాలు తీసేస్తే ఉన్నది ఒక్కటే అది బ్రాహ్మిస్థితి.

38) నేను అనే తలంపు, నాది అనే తలంపు ఈ రెండు తలంపులే మనిషిని పాడుచేస్తున్నాయి ఎవడు పాపం చేసినా, దోషం చేసినా ఈ రెండు తలంపులే కారణం.

39) మనలో ఉన్న దోషాలను తొలగించటానికే మహావిష్ణువు రాముడి రూపంలో, కృష్ణుడి రూపంలో వచ్చాడు మనం వారిని స్మరిస్తే చాలు. మనలో ఉన్న దోషాలను బయటకి తోలేసి మనలను పరమ పవిత్రులుగా చేస్తారు.

40) మన మనస్సులో కల్మషం ఉండటం వల్ల మనకు భక్తి యొక్క విలువ తెలియటం లేదు. మనస్సులో ఉన్న కల్మషం మనకు భగవంతుడి పాదాల యందు గౌరవం కలగనివ్వదు. ఇది మహామాయ.

41) పామునోట్లో ఉన్న విషం పామును చంపదు. అది ఎవరిని కరిస్తే వారిని చంపుతుంది. అలాగే భగవంతుడిలో ఉన్న మాయ ఆయనను ఏమి చెయ్యదు. ఆ మాయలో తగులుకున్నా వారందరూ మసి అయిపోతారు. మనం భగవంతుడి పాదాలను ఆశ్రయిస్తే భగవంతుడి స్వాధీనంలో మాయ ఉంది కాబట్టి ఆ

మాయ మనకు దారి ఇస్తుంది.

42) సత్పురుషులతో సహవాసం వలన మనస్సు నిర్మలమౌతుంది, మనస్సు పవిత్రమవుతుంది. మనస్సుకు లో చూపు కలుగుతుంది. మనస్సుకి లోచూపు కలిగి దాని మూలంలోనికి అది ఉపసంహరింపబడినప్పుడు మనస్సు నశిస్తుంది. అప్పుడు ఆత్మజ్ఞానం కలుగుతుంది.

43) కృష్ణుడు చెప్పే కర్మ రహస్యం ఏమిటి అంటే మీరు పని ఎలా చెయ్యాలి అంటే పని జరుగుతూ ఉండాలి అక్కడ నేను కనబడకూడదు ఆ పని పూర్తి అయ్యేటప్పటికి ఈ నేను కూడా పోవాలి. ఈ నేను పోయిన తరువాత ఉన్నది బ్రహ్మమే.

44) మమకారం విడిచిపెట్టేయండి, మమకారం విడిచిపెట్టేయండి అని లోకంలో చాలా మంది చెపుతూ ఉంటారు. కాని మహాత్ములపట్ల, మహర్షుల పట్ల, సజ్జనులపట్ల మమకారం విడిచిపెట్టకూడదు.

45) పాండవులు కౌరవులు మనలోనే ఉన్నారు. మనలోని మంచి గుణాలే పాండవులు చెడుగుణాలు కౌరవులు. మన హృదయంలో ఈ రెండు గుణాలకూ ఎప్పుడూ యుద్ధం

జరుగుతూ ఉంటుంది. అదే మనలో జరుగుతున్న కురుక్షేత్రం.

46) అవసరం లేని విషయాలకి మనం వెళుతూ ఉంటే అహంభావన చిక్కబడిపోతుంది. మనం ఎంతసేపు అహంభావన పల్చబడేటట్టు చూచుకోవాలి. నీ కుడిచెయ్యి చేసేపని ఎడమ చెయ్యికి తెలియకూడదు అని ఏసుక్రీస్తు అన్నాడు. అంత నిరహంకారంగా, అంత నిరాడంబరంగా నువ్వు పని చెయ్యాలి. అప్పుడు నీకు చిత్తశుద్ధి కలుగుతుంది.

47) మనం పైకి అతి సామాన్యంగా కనిపిస్తూ ఉండాలి, లోపల బలం పెంచుకొంటూ రావాలి మన ఆలోచనా విధానం సక్రమంగా ఉండాలి అర్థం చేసుకోవటం కూడా ఒక యోగం.

48) నీకు దేహబుద్ధి పోయింది అనుకో ప్రారబ్ధం నిన్ను ముట్టుకోదు జ్ఞాని ఏమి చేస్తాడు అంటే వైరాగ్యం అనే పెద్ద కత్తి పట్టుకొని లోపల ఎవడైతే అశాంతికి గురి అవుతున్నాడో వాడిని నరికేస్తాడు.

49) రాముడికి వసిష్ఠుడు గురువు కృష్ణుడికి సాందీపులవారు గురువు పరశురాముడికి దత్తాత్రేయుడు గురువు కాని రమణుడికి గురువు ఎవరూలేరు.

50) భగవాన్‌కి మరణానుభవం ద్వారా అరుణాచలేశ్వరుడు ఆయన

హృదయంలో చైతన్యంగా వ్యక్తమయ్యాడు అప్పుడు భగవాన్‌కి గురువు అరుణాచలేశ్వరుడు.

51) అభ్యాసం లేకుండా వైరాగ్యం లేకుండా, స్వాధ్యాయన లేకుండా సత్పుర్షుల సహవాసం లేకుండా, దేవతల అనుగ్రహం లేకుండా గురువు దయ లేకుండా ఒక అంగుళం లోపలకు దిగలేరు మీరు గంటల తరబడి ధ్యానం చేసి ఒక అంగుళం లోపలకు వెళ్ళండి అప్పుడు అంతర్ముఖంగా ప్రయాణం చేయటం ఎంత కష్టమో మీకు అర్థమవుతుంది.

52) సముద్రం చైతన్యం అందులో ఉన్న చిన్న బుడగ జీవుడు ఆ బుడగ పగిలిపోతే సముద్రం అవుతుంది. ఆ బుడగ బుడగగా ఉంటే సముద్రం అవ్వదు. ఆ బుడగని అంటే జీవుడిని చైతన్య సాగరంలో కలిపేసుకున్నాడు అరుణాచలేశ్వరుడు అప్పుడు అంతా చైతన్యమే.

53) ఎక్కడ నుంచి ఎక్కడ నుంచో ప్రవహించి చివరకు సముద్రంలో కలవవలసిందే అలాగే ప్రారబ్ధవశాత్తు మీరు జన్మలెత్తినా చివరకు హృదయగృహలోనికి చేరుకోవలసిందే.

54) ఓ అరుణాచలేశ్వరుడా! నిన్ను పట్టుకున్నాను. నీ రూపాన్ని సపోర్టుగా పెట్టుకొని నిన్ను ఎంజాయ్ చేస్తున్నాను. నువ్వు

ఏమి చేసావంటే నేను వేరుగా ఉండి నిన్ను చూడటానికి వీలు లేకుండా నన్ను నీలో ఐక్యం చేసేసుకొన్నావు. నా కొంప ముంచేసావు నా వ్యక్తిభావన తీసేసావు.

55) ఆనందం ఎక్కడైతే లేదో అక్కడ భక్తులు చేత వెతికించడం, అన్వేషణ చేయించటం అది గురువు చేసే పనికాదు, రాక్షసుడు చేసేపని. ఎక్కడైతే శాంతి స్థానం ఉందో అక్కడకు నీ మనస్సును నీ ఇంద్రియాలను మళ్ళించేవాడు గురువు నీకు రైట్ డైరక్షన్ చూపించేవాడు గురువు.

56) మీ శరీరంలో ఉన్న ప్రాణం పోయే టైముకి మీరు నూటికి నూరుపాళ్ళు ఆనందంగా, శాంతిగా ఉండగలిగితే మీకు పునర్జన్మ లేదు. ఇది మీరు గుర్తుపెట్టుకొండి.

57) నిరంతరం ఈశ్వరుడిని స్మరించటం వలన, నిరంతరం ఈశ్వరుడి దయ సంపాదించే ప్రయత్నంలో ఉండటం వల్ల మనస్సులో ఉన్న కల్మషాలన్ని పల్చబడిపోతాయి.

58) నిజంగా నీకు గురువు అనుగ్రహం ఉంటే నీ బలహీనతలను ఎత్తి చూపిస్తాడు. ఎత్తి చూపించటమే కాదు, అవి ఎలా తొలగించుకోవాలో ఉపాయము నీకు తట్టేలా చేస్తాడు, పోగొట్టుకునే శక్తిని కూడా నీకు ప్రసాదిస్తాడు వాడే గురువు

గురువు అంటే పని లేకుండా మొద్దులా ఉంటాడు అనుకోకండి గురువు అంతర్యామిగా ఉంటాడు.

59) మనకు వచ్చే తలంపులు చూస్తాడు. మనం చేసే పనులు చూస్తాడు మనకి ఎక్కువ జన్మలు ఇవ్వకూడదు అని గురువు అనుకున్నప్పుడు ఎక్కువ అనుభవాలు ఒక్క జన్మతోనే తీసుకు వచ్చి అన్ని అనుభవింపచేసి మనల్ని కడిగిన ముత్యంలా చేసి ఆయన స్వరూపాన్ని మనకి ఇస్తాడు. వాడు గురువు.

60) ఈ ప్రపంచంలో చెడ్డవాళ్ళకీ రోజులు సుఖంగా వెళ్ళిపోతున్నాయి, మంచివాళ్ళు ఎక్కువ కష్టాలు పడుతున్నారు. అని కొంతమంది అనుకుంటారు. భగవంతుడు ఎవరినైతే అనుగ్రహించాడో వాళ్ళకి వంద జన్మలలో అనుభవించవలసిన కష్టాలు ఒక్క జన్మలో అనుభవింపజేసి తన స్వరూపాన్ని ఇస్తాడు వాడు ఈశ్వరుడు.

61) నీ మనస్సు మీదగాని, నీ ఇంద్రియాల మీద గాని, నీ శరీరం మీద కాని ఆధారపడవద్దు. ఎన్ని అయినా మీకు ఉండనివ్వండి సుఖంకోసం బాహ్యవస్తువులు దేని మీద ఆధారపడవద్దు. మీ మనస్సు అక్కడ వాలనివ్వకూడదు.

62) జ్ఞానం సంపాదించాలనే జి జ్ఞాస మీ లోపలి నుంచి వస్తూ

ఉంటే గురువు చెప్పే మాటలు మీకు ఉపయోగపడతాయి.

63) విత్తం, వృత్తం, విత్తం అంటే డబ్బు వృత్తం అంటే శీలము అని అర్ధం, ధర్మము అని అర్ధం వృత్తం లేకుండా విత్తంలోకి వెళ్ళకండి అని అంటే మీరు ధర్మంగా సంపాందించుకోండి.

64) మనం ఎంతో కొంత ఈశ్వరుడిని పట్టుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాము కాని మనలను భగవంతుడు పట్టుకోవటం లేదు. వదిలేసాడు పట్టుకునే సూచనలు కూడా లేవు ఎందుచేతనంటే మనం బాహ్యమైన గొడవల తోటి, కీర్తికాంక్షతోటి, పాండిత్యం తోటి, ధనంతోటి, అధికారం తోటి తాధాప్యం పొంది ఉంటున్నాము.

65) ప్రపంచాన్ని జయించడం అంటే ప్రపంచంలో ఉన్న రాగద్వేషాలు కాని, ప్రాపంచిక గొడవలు కాని మీ మెదడులో పడకూడదు అప్పుడు మీరు ప్రపంచాన్ని జయించినట్లు.

66) బుద్ధికి అందని మాట నిజమే కాని శుద్ధబుద్ధి అయితే, పవిత్రమైన బుద్ధి అయితే ఏకాగ్రమైన బుద్ధి అయితే, యోగ్యమైన బుద్ధి అయితే భగవంతుడు వాడికి అందుతాడు.

67) మనిషి ఒంటరిగా పుడతాడు, వాడి దేహ ప్రారబ్ధాన్ని అనుసరించి జీవిస్తాడు, ఒంటరిగా వెళ్ళిపోతాడు. నేను ప్రారబ్ధం

అనుభవిస్తున్నాను అని నీ దేహం అనుకోదు. నీ మనస్సే నేను ప్రారబ్ధం అనుభవిస్తున్నానని చెబుతుంది.

68) భౌతికమైన సంఘటనల వల్ల వచ్చే బాధలకంటే మన అజ్ఞానం పెట్టే భాదలు ఎక్కువ ఉంటాయి. మొత్తం ప్రపంచంలో ఉన్నశాస్త్రాలు అన్ని నేర్చుకొని అందులో మీరు పాండిత్యం సంపాదించినా, ఒక జ్ఞాని చూపుకు సరిపోవు, ఒక జ్ఞాని దయకు సరిపోవు జ్ఞాని అంటే ఆత్మ అయిఉన్నాడు. ఒక జ్ఞాని యొక్క దయ మీకు కలిగితే ఇంక మీకు శాస్త్రాల గొడవలేదు. సాధన గొడవలేదు. అది జ్ఞానం యొక్క వైభవం.

69) మనందరికి యజమాని మన కంట్రోలర్, మన నిజమైన భర్త సర్వేశ్వరుడు ఆయన మనం ఒక్కటే అనే అనుభవం కలిగేవరకు మనలను దు:ఖం విడిచిపెట్టదు, అశాంతి విడిచిపెట్టదు.

70) గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే నన్ను శరణు వేడుకో, నేను ఉన్నాను అని పూర్తిగా విశ్వసించు, నా అనుగ్రహాన్ని సంపాదించుకోవటానికి ప్రయత్నం చేయి నేను ఏదైతే వద్దని చెప్పానో అది మానెయ్యి నేను చెయ్యమని చెప్పిన పని చెయ్యి, చెయ్యకూడనిది చెయ్యటం ఎంతపొరపాటో చేయవలసిన డ్యూటీ మానెయ్యటం కూడా అంతే పొరపాటు అని చెప్పాడు.

71) భగవంతుడు మనకు బుద్ధిని ఇచ్చాడు. ఎవడైతే మనకు బుద్ధిని ఇచ్చాడో, ఈ బుద్ధి వెళ్ళి ఆయనతో ఐక్యం అవ్వాలి అదే మన కడసారి జన్మ

72) ఏ హృదయగుహలో అయితే పరమేశ్వరుడు ఉన్నాడో అక్కడకు నిన్ను తోలుకొని పోయేవాడు గురువు మీ కోరికతో మీ తలంపుతో సంబంధం లేకుండా మీ పని నెరవేర్చేవాడే నిజమైన గురువు.

73) ఈ కాలాలు, దూరాలు, దేశాలు ఇవన్నీ అబద్ధం అంటున్నారు భగవాన్ గాఢనిద్రలో కాలం, దూరం, దేశం, కష్టాలు, నష్టాలు ఇవి ఏమి లేవు ఇవన్ని కల్పించుకున్న గొడవలు.

74) బాహ్యమైన పుష్పాలు ఇవ్వటం వలన నీ దు:ఖంపోదు, మనస్సు అనే పుష్పాన్ని గురువుకు సమర్పిస్తే నీ దు:ఖం నశిస్తుంది. గురువు నువ్వు వేరుకాదని ఆయనే నీవని అప్పుడు నీకు తెలుస్తుంది. అది నీకడసారి జన్మ.

75) మీ హృదయంలో చైతన్యం ఉంది. మీ సాధనబలం వల్ల సజ్జన సాంగత్యం వల్ల, సద్గ్రంధ పఠనం వల్ల, ఈశ్వరుడిని ఉపాసన చేయటం వల్ల లోపలి ఉన్న చైతన్యం కొంచెము మేల్కొంటూ ఉంటే మనస్సు యొక్క వాండరింగ్ తగ్గిపోతుంది.

వరదలో మీరు గడ్డిపరక వేస్తే చాలా వేగంగా కొట్టుకుపోతుంది అలాగే ఈ చైతన్యం లోపల మేల్కొన్నప్పుడు మన మనస్సనే గడ్డిపరకని కొన్ని క్షణాల్లో లోపలికి లాగేస్తుంది. ఇంక ఈ పుణ్యము, పాపము లెక్కలు వేసేవాడు ఉండదు.

76) ఒకవేళ దేవుడు ఎప్పుడైన కనిపిస్తే నాకు మంచి బుద్ధిని ప్రసాదించమని అడగండి వరాలు మీరు అడిగారా కష్టాలు తెచ్చిపెట్టుకున్నట్టే మనకు వరం ఇచ్చి ఆవరం వెనకాల భాదలన్ని పంపేస్తాడు. భగవంతుడు మాయావి అసలు మనకు ఏమి కావాలో మనకి తెలియదు. కాబట్టి స్వామి మేము అహంకారం తోటి బతుకుతున్నాము. మాకు ఏది మంచిదో తెలియదు తెలియక కోరికలు కోరుకుంటాము. ఒకోసారి మేము మంచి అనుకున్నది భవిష్యత్తులో చెడ్డ తీసుకురావచ్చు. తండ్రీ మాకు మంచి ఏదో చూపించి మమ్మల్ని తరింపచేయి అని ప్రార్థించాలి.

77) మీ దేహాన్ని ప్రారబ్దానికి వదిలేసి ఎక్కడైతే శాంతి ఉందో, ఎక్కడైతే సుఖం ఉందో ఆస్థితిలోకి నువ్వు మేల్కొవటానికి నీ మనస్సునంతా, నీ శక్తినంతా ఉపయోగించుకో వ్యర్థమైన చింతలు, వ్యర్థమైన కోరికలు, వ్యర్థమైన పనులమీద నీ మనస్సుని

పెట్టుకు మోక్ష సుఖం పొందటానికి ప్రయత్నం చెయ్యి.

78) భ్రాంతులన్ని ఊడిపోతే వాసనలన్నీ ఊడిపోతే అప్పుడు బ్రహ్మము బట్టబయలు అవుతుంది. లోపల హృదయం ఖాళీ అవ్వకుండా ఎవరికి జ్ఞానం రాదు. మీ హృదయం ఖాళీ అయిపోతుంది అనుకోండి శాంతి సామ్రాజ్యానికి మిమ్మల్ని అధిపతి చేయటానికి ఒక్కక్షణం కూడా భగవంతుడు ఆగడు.

79) మీరు ఆసక్తి లేకుండా పనిచేస్తే మీకు ఫలితాలు అనుకూలంగా వచ్చినా అది మిమ్మల్ని బంధించదు. మనం కోరి తెచ్చుకున్నది బంధిస్తుంది.

80) మన బుద్ధి సరిగా లేకపోతే ఎవరూ మనలను బాగుచేయలేరు. నీ బుద్ధి బాగుపడటానికి, నీ బుద్ధిలో ఉన్న హెచ్చుతగ్గులు తగ్గటానికి రాగద్వేషాలు తగ్గటానికి రామనామానికి మించిన మెడిసిన్ లేదని నారదమహర్షి చెప్పాడు.


81) మనం వస్తువును ఎలా పొందాలి అని తెలుసుకోవటం జ్ఞానం. తెలుసుకొన్న విషయాన్ని అనుభవంలోనికి

తెచ్చుకోవటం విజ్ఞానం. జ్ఞానానికి, విజ్ఞానానికి కొంత గేప్ ఉంటుంది.

82) మీరు తెలుసుకొన్న విషయం మీకు అనుభవంలోకి రావటం కష్టం. మీరు తెలుసుకొన్న విషయం మీకు అనుభవంలోనికి రావటానికి జన్మాంతరములో నుండి వచ్చే వాసనలు అడ్డువస్తాయి. అడ్డువచ్చినపుడు వాటిని తొలగించుకోవటానికి మీరు ప్రయత్నంచేస్తారు, తొలగము అని అవి చెపుతాయి. అప్పుడు విపరీతమైన పోరాటం జరుగుతుంది. అప్పుడు తట్టుకోగలిగితే జ్ఞానం, విజ్ఞానంగా మారుతుంది.

83) దేనిని స్వీకరించాలి, దేనిని విసర్జించాలి, ఏది సత్యం, ఏది సత్యం కాదు అనే వివేకం మీరు పెంచుకోకపోతే మీ పాడు మీరే తెచ్చుకొంటారు. మీ అంతట మీరే నాశనం అయిపోతారు.

**శ్రీ రమణార్పణమస్తు**


అరుణాచల గిరి